సాక్షి
జనగామ
మంగళవారం | 7 | నవంబర్ | 2023



మాతృభాష ప్రాధాన్యత..

మాతృభాష ప్రాధాన్యత పెంపొందించాల్సిన అవసరం ఉందని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు.

- IIలో▸



కోళ్ల పరిశ్రమతో ఉపాధి మార్గాలు

కోళ్ల పరిశ్రమతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మారావు అన్నారు.

- IIలో▸

గరిష్టం/కనిష్టం
29^0 / 23^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. రాత్రి సమయంలో చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రతీ వాహనం తనిఖీ చేయాలి

కలెక్టర్ శివలింగయ్య



జనగామ: చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనం తనిఖీ చేసిన తర్వాతనే పంపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ఆదేశించారు. జనగామ నియోజకవర్గం కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్టు నిర్వహణ, రికార్డుల మెయింటనెన్స్ తదితర వాటిని పరిశీలించారు.

26 నుంచి జీడికల్ జాతర



లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల జాతర ఈనెల 26 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం దేవస్థాన ఈఓ శేషుభారతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. డిసెంబర్ ఒకటిన సీతారాముల కల్యాణోత్సవం, 2న రథోత్సవం, 9న పండిత సన్మానోత్సవంతో జాతర ముగుస్తుందని శేషుభారతి పేర్కొన్నారు. కార్యక్రమంలో కొద్వటూరు ఈఓ వంశీ, సిబ్బంది రాజేందర్‌రెడ్డి, రాములు, మోహన్, క్రాంతిరెడ్డి, రమేష్, భరత్, మల్లేశం, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. జీడికల్ ఆలయ హుండీ లెక్కింపు చేయగా రూ.70,434 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

మురళికి స్వర్ణ కంకణం బహూకరణ




జనగామ రూరల్: మండల పరిధి మరిగడి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రేణుకుంట్ల మురళి, రేఖ దంపతులకు కరీంనగర్ ఫిలింభవన్‌లో సోమవారం నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో స్వర్ణ కంకణం బహూకరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా జలంధర్‌రెడ్డి, జానపద అకాడమి మాజీ అధ్యక్షుడు అక్కిరాజు సుందరరామకృష్ణ చేతుల మీదుగా సన్మానించారు.

గ్రహణమొర్రి ఉచిత శస్త్ర చికిత్సకు స్క్రీనింగ్



జనగామ రూరల్: పాఠశాల విద్యాశాఖ, బసవతారకం ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రహణమొర్రి బాధితులకు నిర్వహిస్తున్న ఉచిత శస్త్ర చికిత్సకు గాను సోమవారం స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ రాము మాట్లాడుతూ.. ఈ క్యాంపునకు 12 మంది రాగా.. పరీక్షలు నిర్వహించి 10 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గ్రహణమొర్రి కలిగిన మూడేళ్ల నుంచి 50 ఏళ్ల వయసువారు వారికి పట్టణంలోని భవిత కేంద్రంలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి నర్సింహారావు, డాక్టర్ ముకుందారెడ్డి, ఐఈఆర్‌పీలు విజేందర్, మల్లికార్జున్, ప్రభాకర్, రాజు, అబ్బపాయిలు నీరజ, శోభారాణి, రోహిణి, రామ, తులసి, సుమలత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బక్క నాగరాజుకు సత్కారం



జనగామ: తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు బక్క నాగరాజు యాదవ్ బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వజ్జ పరశురాములు, సలేంద్రి కొమురయ్య, ఝిల్లబోయిన కొమురయ్య, వెంకటేశ్వర్లు, బోళ్ల సంపత్, మారబోయిన రాజు, కొండబోయిన రాజు, సింగరి ప్రశాంత్, ఆరేళ్ల నరేష్, కాస భాస్కర్, గాజుల నరసింహులు, బొంగు శ్రీధర్, సింగరి రాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉల్లం‘ఘనులు’..

ఎన్నికల కోడ్ అతిక్రమణలపై సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు

- జిల్లాలో 73 కంప్లైంట్లు, ఒక కేసు నమోదు
- నిబంధనలు మీరితే చర్యలు తప్పవు



జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ సాంకేతికతను వినియోగిస్తూ.. అభ్యర్థుల ప్రచార కదలికలపై దృష్టి సారించింది. కోడ్ ఉల్లంఘనలపై అధికారులు పర్యవేక్షిస్తుండగా.. మరో వైపు సామాన్య పౌరులకు ఆ బాధ్యలను అప్పగించింది. దీంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయి. కోడ్ అతిక్రమిస్తున్న రాజకీయ పార్టీల సమాచారాన్ని సీ విజిల్ యాప్ ద్వారా అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువస్తున్నారు.

ఫిర్యాదుల వెల్లువ

జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు సీ విజల్ యాప్ ద్వారా 73 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఎటువంటి ఆధారం లేని 24 కంప్లైంట్లను తిరస్కరించగా.. 48 చోట్ల పరిష్కారం చూపించారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధి ముత్తారంలో ఇటీవల టిఫిన్ బాక్స్‌ల పంపిణీకి సంబంధించి కేసు నమోదు చేసి ఆర్‌ఓకు పంపించగా, విచారణ దశలో ఉంది. సీ విజిల్ యాప్‌కు వీడియో, ఆడియో, ఫొటోతో ఫిర్యాదు చేస్తే.. వెంటనే లొకేషన్ ఆధారంగా ఎఫ్ఎస్‌టీ టీం అక్కడికి చేరుకుంటుంది. ఫిర్యాదు చేసిన వ్యక్తికి వివరాలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రానివ్వరు.

1950 టోల్ ఫ్రీ నంబర్‌కు 644 ఫిర్యాదులు

ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ -1950కి 644 ఫిర్యాదులు వచ్చాయి. ఎన్నికల నేపథ్యంలో జూన్‌లోనే ఈ సేవలను కలెక్టరేట్ నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. జూన్‌లో-6, జూలై-11, ఆగస్టు-79, సెప్టెంబర్-131, అక్టోబర్ -417 మంది ఓటరు ఐడీ స్టేటస్, జాబితాలో పేరు వివరాలు, కనిపించకుండా పోయిన ఐడీ కార్డు తిరిగి తీసుకోవడం, ప్రాంతాలు మారితే ఓటర్ ఐడీ కార్డు పొందడం, ఫాం 6,7,8 అప్లికేషన్ విధానం తదితర వాటిపై ఫిర్యాదులు, సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

యాప్ వినియోగంపై అవగాహన

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు ఎలా చేయాలనే దానిపై ఎన్నికల అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభ పెట్టడంతో పాటు డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయడం, ఓటర్లను బెదిరించడం లాంటివి ఎన్నికల ఉల్లంఘన కిందకు వస్తాయి. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.



జిల్లా వ్యాప్తంగా సీ విజిల్ యాప్ ఫిర్యాదులపై సీసీల ద్వారా పర్యవేక్షిస్తున్న ఎఫ్ఎస్‌టీ టీం

సత్వర పరిష్కారం..

సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన గంట లోపు ఫ్లయింగ్ స్క్వాడ్(ఎఫ్ ఎస్‌టీ) అధికారుల బృందం సంఘటన స్థలానికి చేరుకుంటుంది. సమగ్ర విచారణ చేపట్టి నియోజకవర్గ పరిధి ఆర్‌ఓకు నివేదిక సమర్పిస్తుంది. ఫిర్యాదులో పేర్కొన్న విషయాలు నిజమని నిర్ధారిస్తే కేసు నమోదు చేసుకుని ఎలక్షన్ కమిషన్‌కు పంపిస్తారు. కాగా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే వారి వివరాలు, అడ్రస్‌ను ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గోప్యంగా ఉంచుతారు.



ఫ్లయింగ్ స్క్వాడ్ టీం

రెచ్చగొడితే జైలుకే..

మతం, జాతి, కులం, సంఘం లేదా భాషా ప్రాతిపదికపై పౌరుల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టినా.. శత్రుత్వాన్ని పెంపొందించినా నేరమే. 123 ఆర్‌పీ యాక్టు ప్రకారం అలాంటి వారికి శిక్ష పడుతుంది. 125 ఆర్‌పీ యాక్ట్ మేరకు ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్ల జైలు అమలు చేయవచ్చు. అలాగే తప్పుడు సమాచారం అందించినందుకు ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా విధించడానికి వీలుంది. ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగంగా సభలు నిర్వహించిన వారు శిక్షకు అర్హులే. అందుకు రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా అమలు చేయడానికి అవకాశం ఉంది. 127 యాక్టు ప్రకారం ఎన్నికల సమావేశం సందర్భంగా ఎలాంటి అల్లర్లు చేసినా ఆ వ్యక్తులను అరెస్టు చేస్తారు. ఆరునెలల జైలు శిక్ష లేదా రూ.2వేల జరిమానా విధిస్తారు.

పోస్టర్‌పై పేరు ఉండాల్సిందే..

ఎవరైనా తన పేరు, చిరునామా లేకుండా ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు ముద్రిస్తే ఆరు నెలల జైలు శిక్ష పడుతుంది. 128 యాక్టు ప్రకారం బహిరంగంగా ఓటు వేస్తే మూడు నెలల జైలు లేదా జరిమానా లేదా రెండూ అమలు చేసే అవకాశం ఉంది. 29 ఆర్‌పీ యాక్టు ప్రకారం.. ఎన్నికలకు సంబంధించిన అధికారులు లేదా పోలీసులు పోటీ చేసే అభ్యర్థికి సహకరించినా లేదా ప్రభావం కలిగించినా శిక్షార్హులే. 130 ఆర్‌పీ యాక్టు ప్రకారం పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల లోపల ప్రచారం చేయకూడదు.

ఓటింగ్ రోజు జాగ్రత్త

పోలింగ్ స్టేషన్ దగ్గరలో కోడ్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ప్రచారం చేసినా ఏ పోలీసు అధికారి అయినా సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. మూడు నెలల జైలు లేదా జరిమానా విధించవచ్చు. ఓటు వేసే సమయంలో నియమ నిబంధనలు పాటించని వారికి మూడు నెలల జైలు శిక్ష లేదా జరిమానా పడుతుంది. పోలింగ్ బూత్ వద్దకు చేరవేసేందుకు అక్రమంగా వాహనాలు సమకూర్చడం నేరమే. ఎన్నికల సందర్భంగా అధికార దుర్వినియోగం చేస్తే శిక్షార్హులే. అందుకు రూ.500 జరిమానా విధిస్తారు. 134 ఆర్‌పీ యాక్టు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటుగా లేదా పోలింగ్ ఏజెంటుగా వ్యవహరించినా శిక్షార్హులే. ఇందుకు మూడు నెలల జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు. పోలింగ్ స్టేషన్ పరిసరాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషేధం. ఈవీఎం అపహరిస్తే శిక్ష పడుతుంది. పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజు మద్యం అమ్మడం, అందించడం నేరం. అందుకు ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.2వేల వరకు జరిమానా పడుతుంది.

నాలుగోరోజు ఐదు నామినేషన్లు



బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



నామినేషన్ వేస్తున్న ఎర్రబెల్లి ఉషాదేవి

- పత్రాలు అందజేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఉషాదేవి
- ఇప్పటి వరకు 10 నామినేషన్ల దాఖలు

జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం నాలుగోరోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల రిటర్నింగ్(ఆర్‌ఓ) అధికారులు మురళీకృష్ణ, వి.రామ్మూర్తి, రోహిత్‌సింగ్ ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాలు స్వీకరించారు. ఇప్పటి వరకు మొత్తం 10 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. బీఆర్‌ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థిగా ఎర్రబెల్లి దయాకర్ రావు, అదే పార్టీ తరఫున మంత్రి సతీమణి ఎర్రబెల్లి ఉషాదేవి, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బూడిద సునీల్ నామినేషన్ వేశారు. జనగామ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా తరిగొప్పుల మండలం సోలిపురానికి చెందిన చెవిటి అర్జున్, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా ధర్మసాగర్‌కు చెందిన కొట్టెసోబు నామినేషన్ వేశారు. డీసీపీ పి.సీతారాం ఆధ్వర్యంలో ఏసీపీలు, సీఐ, ఎస్‌ఐలు, బీఎస్‌ఎఫ్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆర్‌ఓ సెంటర్ల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా.. ఈనెల 10వ తేదీన మరో దఫా నామినేషన్ వేయనున్నట్లు మంత్రి దయాకర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, సత్యవతి రాథోడ్‌తోపాటు ఎంపీ పసునూరి దయాకర్, ఎంఎల్‌సీ కడియం శ్రీహరి హాజరవుతారని పేర్కొన్నారు.



ధర్మ సమాజ్ పార్టీ నుంచి సునీల్..



స్టేషన్‌ఘన్‌పూర్ స్వతంత్ర అభ్యర్థిగా కొట్టె ఏసోబు..



జనగామ స్వతంత్ర అభ్యర్థిగా అర్జున్..

వందేభారత్ రైలుపై రాళ్లదాడి

- ఆర్‌పీఎఫ్ అదుపులో ఇద్దరు యువకులు?

జనగామ: వందేభారత్ రైలుపై ఇద్దరు పోకిరీ యువకులు రాళ్లదాడి చేసిన ఘటన జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. వందేభారత్ రైలు విశాఖపట్నం నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్ వెళ్లోంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు యువకులు.. మధ్యాహ్నం 1.19 గంటల సమయంలో రైలు జనగామకు చేరుకునే సమయంలో రాళ్లతో దాడి చేశారు. పైలెట్ ఫిర్యాదు మేరకు కాజీపేట, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సుమారు 30 మంది ఆర్‌పీఎఫ్ బలగాలు జనగామకు చేరుకున్నాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా పట్టణంలోని గిర్నిగడ్డ, వీవర్స్ కాలనీ, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాలను జల్లెడ పట్టాయి. రైలు వెళ్లే సమయంలో పట్టాల వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యువకులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఇటీవల జిల్లా కేంద్రానికి వచ్చి భవన నిర్మాణ రంగంలో కూలీపని చేస్తున్నారు. ఆ యువకులను పట్టుకున్న విషయాన్ని గోప్యంగా ఉంచారు. గతంలోనూ వందేభారత్ రైలుపై రాళ్లదాడి జరగ్గా.. జనగామలో రిపీట్ కావడంతో దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. స్థానిక అధికారులు అప్రమత్తమయ్యారు.



వందేభారత్ రైలు, పక్కన అనుమానాస్పదంగా యువకులు(సీసీ ఫుటేజీ)

అసంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం

- డీఎంహెచ్‌ఓ ప్రశాంత్

జనగామ రూరల్: అసంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరమని, క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందేలా చూడాలని డీఎంహెచ్‌ఓ ప్రశాంత్ అన్నారు. సోమవారం పట్టణంలో వైద్యాధికారులకు, పల్లె దవాఖాన వైద్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. షుగర్, క్యాన్సర్, బీపీ, గుండె సంబధిత వ్యాధులపై ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వారికి అవసరమైన మందులు ప్రతి నెలా ఇవ్వడంతో పాటు.. కొత్తగా ఎవరైనా ఉంటే చికిత్స అందించాలని సూచించారు. ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్, డాక్టర్ కర్ణాకర్‌రాజు, టీబీ ప్రోగాం అధికారి మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రశాంత్

బీఆర్‌ఎస్‌తోనే గౌడ కులస్తుల అభ్యున్నతి



నాయకులతో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు రమేష్

- తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు రమేష్

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గౌడ కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందారని, సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు రమేష్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ స్థానిక కార్యాలయంలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజుగౌడ్ అధ్యక్షతన కులస్తుల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు గౌడ కులస్తుల సమస్యల్ని పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో 103 కల్లు డిపోలను మూసి వేయించగా.. బీఆర్‌ఎస్ సర్కారు వాటిని తెరిపించి వందలాది గౌడ కుటుంబాలకు ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో కడియం శ్రీహరి పలు అభివృద్ధి పనులు చేయారని, ఆయనను గెలిపిస్తే మరింతగా అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా జనగామకు సర్దార్ సర్వాయ్ పాపన్న జిల్లాగా పేరు పెట్టాలని ఈ సందర్భంగా సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్టపురి ఏకాంతం, రాష్ట్ర, జిల్లా నాయకులు జనగామ వెంకటస్వామి, నాయిని యాదగిరి, తాళ్లపెల్లి సమ్మయ్య, చిర్ర నాగరాజు, జనగాం యాదగిరి, గట్టు రమేష్, బత్తిని రాజ్‌కుమార్, పులి రాజన్న, రంగు రమేష్, పొన్నం శ్రీనివాస్, ఐలోని సుధాకర్, తాళ్లపెల్లి సంపత్, జగన్నాథం, పులి యాకయ్య, నాగరాజు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక షష్టిపూర్తి, తులాభార మహోత్సవం

జనగామ: పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డున ఉన్న సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన ఎస్ఎస్‌కేఎస్ఎస్ వైశ్య మిత్రుల ఆధ్వర్యంలో సామూహిక షష్టిపూర్తి, తులాభారం మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రతినిధులు వంగపల్లి చంద్రశేఖర్, ఒరుగంటి నటరాజ్, ఒరుగంటి కేదారీనాథ్, గట్టు శ్రీనివాస్, బెలిదె నాగరాజు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 60 మంది దంపతులకు షష్టిపూర్తి, తులాభారం చేస్తామని, ఒక్కో జంట రూ.15,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనే దంపతులకు అవసరమైన సామగ్రిని కమిటీ ఇస్తుందని, ఒక్కో జంట తరఫున 15 మంది కుటుంబ సభ్యులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9948636220, 7337454004, 98495 31214, 98491 58080, 98661 23997 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వతంత్రులకు పట్టం

- ఇండిపెండెంట్లను గెలిపించిన ఓరుగల్లు ఓటర్లు
- తోకల లక్ష్మారెడ్డి నుంచి దొంతి మాధవరెడ్డి వరకు
- రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా ఓంకార్ విజయం

సాక్షిప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ ఎన్నికల పోరులో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేవారు ఎందరో.. కానీ విజయ తీరాలకు చేరేది కొందరే. ప్రధాన పార్టీల అభ్యర్థులతో తొడకొట్టి బరిలో నిలిచి గెలవాలంటే ఆషామాషీ విషయం కాదు. ఆ నియోజకవర్గంపై పట్టు మాత్రమే కాదు. ప్రజల మనసుల్లో స్థానం పొందాలి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి 12 శాసనసభ నియోజకవర్గాల్లో ప్రతీ ఎన్నికల్లో వందల సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. అందులో ఇప్పటి వరకు ఐదుగురు మాత్రమే విజయబావుట ఎగురవేశారు.

1967 నుంచి...

ఉమ్మడి వరంగల్‌లో 1967 నుంచి స్వతంత్ర అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యే ప్రక్రియ కొనసాగింది. ప్రజలతో మమేకమై వాళ్ల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటే.. విజయాన్ని చేజిక్కించుకునేందుకు అవకాశం ఉందనడానికి ఆనాటి ఫలితాలే నిదర్శనం. 1967లో మొదలైన ఇండిపెండెంట్ అభ్యర్థుల ఎన్నిక ప్రక్రియ 2014 వరకు కొనసాగింది. అత్యధికంగా నర్సంపేట నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ప్రధాన పార్టీల అభ్యర్థులను ఓడించి స్వతంత్ర అభ్యర్థులకు ఓటర్లు పట్టం కట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన పలువురు శాసనసభలోకి అడుగు పెట్టారు.



ఓంకార్



దొంతి మాధవరెడ్డి

ఎక్కడెక్కడ.. ఎవరెవరు?

ప్రధాన పార్టీల టికెట్ ఆశించి భంగపడ్డ క్రమంలో చాలామంది స్వతంత్రులుగా బరిలో నిలిచి గెలిచారు. కొందరైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి నెగ్గిన సందర్భాలూ ఉన్నాయి.

- స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం 1957 నుంచి 1972 వరకు జనరల్ స్థానంగా ఉంది. 1978లో ఎస్సీ రిజర్వుడు చేశారు. 1967లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన టి.హయగ్రీవాచారిపై ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచిన తోకల లక్ష్మారెడ్డి 3,256 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. హయగ్రీవాచారికి 17,280 ఓట్లు రాగా లక్ష్మారెడ్డికి 20,536 ఓట్లు వచ్చాయి.
- 2009 వరకు నియోజకవర్గంగా ఉన్న చెన్నూరు రద్దు అయ్యి పాలకుర్తిగా ఏర్పడింది. చెన్నూరు నియోజకవర్గం నుంచి 1972లో కాంగ్రెస్ పార్టీ నుంచి నెమురుగొమ్ముల విమలాదేవి పోటీ చేయగా.. ఆమెపై స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన కె.మధుసూదన్‌రెడ్డి 1,714 ఓట్ల మెజార్టీ సాధించారు. మధుసూదన్ రెడ్డికి 25,654 ఓట్లు రాగా.. విమలాదేవికి 23,940 ఓట్లు వచ్చాయి.
- నర్సంపేట నియోజకవర్గానికి 1957 నుంచి 2018 వరకు 14 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. 1985, 1989, 2014లో మూడుసార్లు ఇండిపెండెంట్లు గెలుపొందారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఉపేంద్రరావుపై ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మద్దికాయల ఓంకార్ 21,398 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఇ.జనార్దన్‌రెడ్డిని ఢీకొట్టిన ఓంకార్ మరోసారి ఇండిపెండెంట్‌గా 11,095 ఓట్ల ఆధిక్యతను సాధించారు. 2014లో కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన దొంతి మాధవరెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిపై 18,376 ఓట్ల మెజార్టీ సాధించారు.
- ఒకప్పటి వరంగల్(ఇప్పుడు తూర్పు) 1952 నుంచి 2018 వరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. 1962లో కాంగ్రెస్ అభ్యర్థి మీర్జాబేగ్‌పై ఇండిపెండెంట్ బి.నాగభూషణరావు 1,725 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన నాగభూషణరావు 1967లో ఆపార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి.. ఇండిపెండెంట్ అభ్యర్థి టి.ఎస్.మూర్తి చేతిలో ఓడిపోయారు.
- 2009 వరకు జనరల్ స్థానంగా ఉన్న వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి 1962, 1967లో స్వతంత్రులే విజయ పతాకాన్ని ఎగుర వేశారు. 1962లో సీపీఐ అభ్యర్థి పీఆర్‌రావుపై స్వతంత్ర అభ్యర్థి కె.లక్ష్మీనరసింహారెడ్డి 1,453 ఓట్ల ఆధిక్యతను సాధించారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పి.ఉమారెడ్డిపై ఇండిపెండెంట్ అభ్యర్థి టి.పురుషోత్తమ రావు 9,296 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- ములుగు నియోజకవర్గానికి ఒక ఉప ఎన్నిక కలుపుకుని 1952 నుంచి 2018 వరకు 16 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. 1967లో జరిగిన ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి పి.రామనరసయ్యపై పోటీ చేసిన సంతోశ్‌చక్రవర్తి 4,929 ఓట్ల మెజార్టీతో ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు.

‘పేట’.. సమస్యల మూట

- నర్సంపేట నియోజకవర్గంలో అసంపూర్తి అభివృద్ధి
- కాబోయే ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం..
- ‘సాక్షి’ గ్రౌండ్ రిపోర్టులో పలు విషయాలు వెలుగులోకి..



రూ.3లక్షల నగదు స్వాధీనం

- వివరాలు IIలో▸

తనిఖీల వివరాలు నమోదు చేయాలి

బచ్చన్నపేట: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద అక్రమ పట్టివేతలను రిజిస్టర్‌లో రికార్డు చేయాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు గన్నత్‌రూహ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గోపాల్‌నగర్ గ్రామ ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టులో ఇప్పటి వరకు సీజ్ చేసిన అక్రమ మద్యం, డబ్బు తదితర వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తనిఖీల సందర్భంగా ఎంతటి వారికైనా మినహాయింపు లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సై కంకల సతీష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



చెక్ పోస్టు వద్ద రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు గన్నత్‌రూహ



వేలకొద్దీ నీతులు బోధించే బదులు ఒక మంచి పని చేసి చూపించింది మేలు.
- మహాత్మాగాంధీ

ఈ ముచ్చటలికనా ?

ఎన్‌డీపీ మద్యం.. ఇలా కనిపెట్టొచ్చు



కాజీపేట అర్బన్ : ఎన్నికల వేళ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించే (నాన్ డ్యూటీ పెయిడ్) మద్యాన్ని కనిపెట్టేందుకు 'వేర్ ఇట్' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆండ్రాయిడ్ మొబైల్‌లో ప్లేస్టోర్ ద్వారా 'వేర్‌ఇట్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్ సాయంతో మద్యం బాటిళ్లపై గల హోలోగ్రామ్, ఈఏఎల్ (ఎక్సైజ్ అడిసివ్ లేబుల్) నంబర్‌ను స్కాన్ చేస్తే చాలు విషయం తెలుస్తుంది. మద్యం ఎక్కడ తయారైంది.. ఏ షాపు నుంచి కొనుగోలు చేశారనే వివరాలు తెలుస్తాయి. ఈ విధానంతో వాహన తనిఖీ వేళల్లో పోలీసులు, ఇతర అధికారులు ఎన్‌డీపీ మద్యాన్ని సులువుగా గుర్తించొచ్చు.

జంగ్ తెలంగాణ

ఓటు.. వజ్రాయుధం..

- సినీ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో



డోర్నకల్ : ఓటు వజ్రాయుధమని, ఓటర్లు మంచి నాయకులకు ఓటు వేసి తమ తలరాత మార్చుకోవాలని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో కోరారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన భీమ్స్ ఓటు హక్కు వినియోగంపై సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. 'గుడిలో నుదిటిపై పెట్టే బొట్టు కంటే.. ఓటు వేసిన తరువాత చేతిపై పెట్టే సిరా చుక్క' ఎంతో విలువైందన్నారు. ఓటు వేసి మంచి నాయకత్వాన్ని గెలిపిస్తే మనమే గెలిచినట్లని చెబుతున్నారు. కులప్రీతి, సానుభూతి, ప్రలోభాలకు తావివ్వకుండా నిజాయితీగా ఓటు వేసి మంచి నాయకులను ఎన్నుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రజలు భాగస్వాములు కావాలని భీమ్స్ పిలుపునిచ్చారు.

రూ.3 లక్షల నగదు స్వాధీనం



వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

నడికూడ: పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారిపై మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ అనే వ్యక్తి కారులో ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రవీందర్ తెలిపారు. సీజ్ చేసిన నగదును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పుష్‌పుల్ రైళ్ల సర్వీస్‌లు రద్దు

- ఈ నెల 12వ తేదీ వరకు అమలు..

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో వివిధ మార్గాల్లో ప్రయాణించే నాలుగు పుష్‌పుల్ రైళ్ల సర్వీస్‌లు ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు రద్దు అయ్యాయి. ఈ మేరకు సోమవారం రాత్రి కాజీపేట రైల్వే కమర్షియల్ అధికారులు రద్దయిన రైళ్ల సర్వీస్‌ల వివరాలు వెల్లడించారు. విజయవాడ రూట్‌లో జరుగుతున్న మూడో రైల్వే లైన్ నిర్మాణం, సిగ్నల్ వ్యవస్థ, అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రద్దయిన సర్వీస్‌లు ఇవే..

రోజూ ఉదయం 6.40 గంటలకు కాజీపేట–డోర్నకల్ (07735) పుష్‌పుల్, డోర్నకల్–కాజీపేట (07754) పుష్‌పుల్, సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్‌పుల్, వరంగల్–సికింద్రాబాద్ (07463) మధ్య నడిచే పుష్‌పుల్ రైళ్ల సర్వీస్‌లు రద్దు అయ్యాయి.

క్రీడల్లో అత్యున్నత ప్రతిభ కనబర్చాలి

- టిమ్రీస్ కార్యదర్శి బి.షఫియుల్లా



రెజ్లింగ్ క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న సెక్రటరీ

న్యూశాయంపేట : రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో టిమ్రీస్ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలని తెలంగాణ మైనార్టీ గురుకులాల విద్యాసంస్థ (టిమ్రీస్) కార్యదర్శి బి.షఫియుల్లా ఆకాంక్షించారు. వరంగల్‌లోని రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనార్టీ గురుకుల పాఠశాలలో సోమవారం రెండో జోష్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హ్యాండ్ బాల్, టెన్నికాయిట్, చెస్, హాకీ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. రంగశాయిపేట జక్కలొద్దిలో బాలురు, శంభునిపేట గురుకులంలో బాలికల క్రీడాకారులకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిమ్రీస్ జాయింట్ సెక్రటరీ లియాఖత్‌హుస్సేన్, అడిషనల్ సెక్రటరీ దిలావర్, అసిస్టెంట్ సెక్రటరీ డీఐఓ కృష్ణకుమార్, హనుమకొండ డీఎండబ్ల్యూఓ మేన శ్రీను, రాష్ట్ర స్పోర్ట్స్ అధికారి సోమేశ్వర్‌తో పాటు ఆర్‌ఎల్‌సీలు, ప్రిన్సిపాల్స్, పీఈటీలు పాల్గొన్నారు.

'పేట'.. సమస్యల మూట..

నర్సంపేట నియోజకవర్గంలో అసంపూర్తి అభివృద్ధి

- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో పలు విషయాలు వెలుగులోకి..
- కాబోయే ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం..

గ్రౌండ్ రిపోర్ట్ నర్సంపేట



నర్సంపేట పట్టణం



నర్సంపేట : నర్సంపేట.. ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. పాకాల సరస్సు, మాదన్నపేట, తదితర చెరువుల ఆయకట్టు పరిధిలో అత్యధిక స్థాయిలో సాగు అవుతోంది. ఫలితంగా నిత్యం పంట పొలాలతో ఈ నియోజకవర్గం మరో కోనసీమలా కళకళలాడుతోంది. వివిధ ఉద్యమాలు, పోరాటాలకు కేంద్ర బిందువై నిత్య చైతన్యం కలిగిన ఈ నియోజకవర్గం స్వరాష్ట్రంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. గత ప్రభుత్వాలు అభివృద్ధి చేసినప్పటికీ చేయాల్సిన పనులు ఇంకా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాబోయే ఎమ్మెల్యేకు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నర్సంపేట నియోజకవర్గ పరిధిలో నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావుపేట, నెక్కొండ మండలాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో 2,26,617ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,11,870, స్త్రీలు 1, 14, 742 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నర్సంపేట పట్టణంలో..

నర్సంపేట .. వరంగల్ జిల్లాలో ప్రముఖ పట్టణంగా వెలుగొందుతోంది. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రి, మెడికల్ కాలేజీ పనులు జరుగుతున్నా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. 40వేల జనాభా పైబడి ఉన్న పట్టణంలో నేటి వరకూ ఆహ్లాదం కోసం పార్కు లేదు. తాగునీరు కోసం మిషన్ భగీరథ పనులు కూడా పూర్తి చేయాల్సి ఉంది. పట్టణంలోని డ్రెయినేజీ నీరు మాదన్నపేట పంట కాలువలోకి వెళ్తోంది. ఫలితంగా పంటలు దెబ్బతినడంతో పాటు రైతులు పలు వ్యాధులకు గురవుతున్నారు.

దుగ్గొండి మండలంలో..

దుగ్గొండి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరు పడకలతోనే కొనసాగుతుంది. దీనిని 30 పడకలకు అప్‌గ్రేడ్ చేసి వైద్యులను నిరంతరం అందుబాటులో ఉంచాలి. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించినా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలి. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని నిరుపేద విద్యార్థులు కోరుతున్నారు.



దుగ్గొండి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ

చెన్నారావుపేట మండలంలో..

చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయినిపహాడ్, పాపయ్యపేట, లింగగిరి, గొల్లపల్లితో పాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రమాదాలకు గురై ప్రాణాల మీదికి కూడా తెచ్చుకున్నారు. కనీసం ఆ రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదు. తారు రోడ్లు వేసి ప్రయాణ సౌకర్యం కల్పించాలి. చెన్నారావుపేట–ఖానాపురం, తిమ్మరాయినిపహాడ్–రంగాపురం గ్రామాలను కలిపే మున్నేరువాగుపై (పాకాల) చెక్‌డ్యాంతో పాటు వంతెన నిర్మించాల్సి ఉంది. ఆ హామీలు అలాగే ఉంటున్నాయి. వంతెనల నిర్మాణం పూర్తయితే వాగు పరిధిలో ఉన్న రైతులకు వ్యవసాయ పనుల్లో సమస్యలు తప్పుతాయి. అంతే కాకుండా రెండు మండలాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి. మండలంలోని కోనాపురం, సంబర్‌వన్ కాలనీతో పాటు పలు గ్రామాల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడంతో పూర్తిస్థాయిలో గ్రామ పాలకవర్గం నీరు అందించలేకపోతోంది. నీటి సమస్య పరిష్కారానికి పకడ్బందీ ప్రణాళిక ఏర్పాటు చేయాలి.



కంకర తేలి అధ్వానంగా మారిన లింగగిరి రోడ్డు

నెక్కొండ మండలంలో..

నెక్కొండ మండల కేంద్రంలోని బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. విద్యుత్, తాగునీరు సౌకర్యం లేదు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. ఇక బస్సులు కూడా రాకపోవడంతో ఇటు వైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదు. దీంతో చికెన్ వ్యర్థాలు, వ్యాపార సముదాయాల నుంచి వచ్చే చెత్తకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ డంపింగ్ యార్డును తలపిస్తోంది. నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మరుగుదొడ్లు లేకపోవడంతో స్థానిక ప్రజలతోపాటు రైళ్లు, బస్సుల్లో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న నెక్కొండ బస్టాండ్

ఖానాపురం మండలంలో..

ఖానాపురం మండలంలోని ప్రధాన నీటి వనరు పాకాల సరస్సు. పాకాల తూములు శిథిలావస్థకు చేరి మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఆయకట్టు పరిధిలోని ప్రధాన కాలువలు తుంగబంధం, పసునూరు, మాటు వీరారం, జాలుబంధం, సంగెం, తదితర కాల్వలు ఏటా గుర్రపుడెక్కతో నిండిపోయి చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. తద్వారా రైతులు సాగుకు ప్రతీ సంవత్సరం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాకాల ఆయకట్టు పరిధిలో వరి పంట పెద్ద ఎత్తున సాగవుతుంది. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో రైతులు రోడ్ల మీద ధాన్యం ఆరబోస్తున్నారు. సబ్ మార్కెట్ యార్డును ఆధునికరిస్తే రైతులకు కొంత మేర ఇబ్బందులు తప్పనున్నాయి. మండలంలోని బుధరావుపేటలో 3/1 సర్వే నంబర్‌లో గల అసైన్డ్ భూమిపై కొన్ని సంవత్సరాలుగా అనేక వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు.



శిథిలావస్థకు చేరి లీకేజీ అవుతున్న పాకాల సరస్సు తూము

30 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలి



దుగ్గొండి మండలంలో 42 వేల జనాభా ఉంది. పేదలు అనారోగ్యం బారిన పడితే 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న వరంగల్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి దుగ్గొండి ఆస్పత్రిని 30 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలి. అన్ని రకాల వ్యాధులకు ఇక్కడే చికిత్స అందించి ప్రజా ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలి.

- వడ్డేపల్లి చంద్రమౌళి, నాచినపల్లి మాజీ జెడ్పీటీసీ

'అసైన్డ్'కు పట్టాలివ్వాలి



నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి శివారులో మాకు ఐదు ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. మూడు తరాల నుంచి ఈ భూమిని సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాం. పట్టా పాస్‌బుక్ కోసం పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిశాం. పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని అడిగాం. కానీ నేటి వరకూ ఇవ్వలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి.

- గోనె జువాకర్, రైతు, నాగరాజుపల్లి

డిగ్రీ కళాశాల, స్టేడియం ఏర్పాటు చేయాలి



నెక్కొండ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్టేడియం, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉంది. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే విద్యార్థుల కోసం డిగ్రీ కళాశాల, యువతకు క్రీడల్లో ఆసక్తి పెంపొందడానికి మండలంలో స్టేడియం ఏర్పాటు చేయాలి. గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి సమస్యలు పరిష్కరించాలి.

- బొమ్మెర శ్రీనివాస్, నెక్కొండ

కాల్వలను ఆధునికీకరించాలి



పాకాల ఆయకట్టు పరిధిలోని ప్రధాన కాల్వలను ఆధునికీకరించాలి. తూములకు మరమ్మతులు చేయించాలి. ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి.

- కుదురుపాక రాములు, అశోక్‌నగర్

భద్రాది కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జగన్‌మోహన్‌రాజు

- కేయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ



జగన్‌మోహన్‌రాజుకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ రమేశ్, పక్కన రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఈఈఈ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి జగన్‌మోహన్‌రాజును నియమిస్తూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. జగన్‌మోహన్‌రాజు 2005లో ఈఈఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. గతంలో వసతి గృహ సంచాలకుడిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సోమవారం వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్.. చేతులమీదుగా కాకతీయ యూనివర్సిటీలో జగన్‌మోహన్‌రాజు ఉత్తర్వులు అందుకున్నారు. ఇప్పటివరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ పున్నం చందర్ నుంచి జగన్‌మోహన్‌రాజు బాధ్యతలు స్వీకరించనున్నారు.

కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా శ్రీనివాస్‌రావు



పి.శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్‌ఎం విభాగ ఆచార్యుడు పి.శ్రీనివాస్‌రావు నియామకమయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ టి. శ్రీనివాస్‌రావు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీగా శ్రీనివాస్‌రావు నేడు (మంగళవారం) బాధ్యతలు స్వీకరించి ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీగా ఆత్మవిశ్వాసంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు.

మాతృభాష ప్రాధాన్యత పెంపొందించాలి

- కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్



మాట్లాడుతున్న వీసీ రమేశ్

కేయూ క్యాంపస్ : మాతృభాష ప్రాధాన్యత పెంపొందించాల్సిన అవసరం ఉందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. కేయూ తెలుగు విభాగం, భారతీయ భాషా సంస్థ మైసూర్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని తెలుగు విభాగంలో నిర్వహించిన 'తెలుగులో పరీక్ష మూల్యాంకనం–ప్రశ్నాంశ రచన'పై ఆరు రోజుల శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ శిబిరంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, తెలుగు విభాగం అధిపతి ఆచార్య బన్న ఐలయ్య మాట్లాడుతూ.. ఒక భాష గొప్ప అంటూ ఉండదని అన్ని భాషలు సమానమేనన్నారు. అయితే మాతృభాష మనిషికి సమాజానికి మధ్య ఒక చక్కని వారధి అన్నారు. యూఎన్‌ఓ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఆరువేల భాషల్లో రెండు వేల భాషలు అంతరించి పోయాయన్నారు. 12 కోట్ల మంది మాట్లాడే తెలుగు భాష సైతం అంతరించి పోయే 50 భాషలో ఉండడం ఆందోళనకర విషయమని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. తెలుగులో పరీక్ష మూల్యాంకనం–ప్రశ్నాంశ రచనపై ఒక శాస్త్రీయమైన అధ్యయనం జరగడం మంచి పరిణామమన్నారు. ముఖ్యవేత్తగా విచ్చేసిన భారతీయ భాషా సంస్థ మాజీ డైరెక్టర్ ఆచార్య డీజీ రావు మాట్లాడుతూ.. భారతీయ భాషలను రక్షించడం ఎలా అనే విషయంపై తమ సంస్థ ఒక ఆలోచన చేస్తుందన్నారు. అనంతరం పంకజ్ ద్వివేది, కోఆర్డినేటర్ ఎం.నారాయణరెడ్డి మాట్లాడారు. ఈ వర్క్‌షాప్ మరో ఐదురోజులు నిర్వహించనున్నారు.

కోళ్ల పరిశ్రమతో ఉపాధి మార్గాలు

- పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న ధర్మారావు

కాజీపేట అర్బన్ : పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీ.రావు ఆశయాలు నేటి తరానికి కోళ్ల పరిశ్రమతో ఉపాధి మార్గాలను కల్పిస్తున్నాయని పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని 'నెక్' కార్యాలయం బీవీరావు భవన్‌లో సోమవారం బీవీ రావు జయంతి సందర్భంగా 'నెక్ డే' వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి మార్తినేని ముఖ్యఅతిథిగా హాజరై బీవీ రావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. సన్నకారు రైతులకు ఆర్థిక స్వాలంబనతోపాటు ఉపాధి కల్పించేందుకు బీవీ రావు కోళ్ల పరిశ్రమలకు శ్రీకారం చుట్టారన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ రోజువారి భోజనంలో గుడ్డును చేర్చుకోవాలని, నా గుడ్డు నా ధర నినాదంతో గుడ్డు ధరను ముందుకు తీసుకెళ్లిన బీవీ రావు సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని నెక్ జోనల్ మెంబర్ త్రిపురనేని సుబ్రహ్మణ్యం తెలిపారు. బీవీ రావు జయంతి, నెక్ డే సందర్భంగా కోడిగుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీఎఫ్ రీజియన్ అధ్యక్షుడు వెనెపల్లి రామారావు, నెక్ లోకల్ వైస్ చైర్మన్ బొబ్బాల శ్రీనివాస్‌రెడ్డి, మార్త రాంప్రసాద్, గాదె రాజేందర్, గైనేని రాజన్, పొత్కనూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దత్త క్షేత్రంలో మహాలక్ష్మి యాగం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

వరంగల్ : దీపావళి పండుగ సందర్భంగా దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి వరంగల్ నగరానికి వస్తున్నారని, ఈ సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు దత్తక్షేత్రం ట్రస్ట్ చైర్మన్ వైవీ.వామన్‌రావు తెలిపారు. సోమవారం ములుగురోడ్డు సమీపంలోని దత్త క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాల కరపత్రాలను ట్రస్ట్ సభ్యులు ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ నెల 10న స్వామిజీ ఆశ్రమానికి చేరుకుంటారని.. శనివారం సాయంత్రం స్వాగత సభ, ఆదివారం ఉదయం వేద మంత్రాలతో శ్రీ సూక్త లక్ష్మీ యాగం, అనంతరం వెయ్యి మంది భక్తులచే సామూహిక శ్రీఅనగాష్టమి వ్రతాలు స్వామిజీ సమక్షంలో జరుగుతాయన్నారు. దీపావళి పండుగ సందర్భంగా శ్రీసూక్త యాగం, సాయంత్రం ఆశ్రమంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో స్వామిజీచే అమ్మ వారికి శ్రీచక్రానికి కొత్త నాణేములతో అర్చన ఉంటుందన్నారు. అనంతరం అర్చన చేసిన నాణాలను భక్తులకు స్వామిజీ ఇస్తారని తెలిపారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని అన్నారు. ట్రస్ట్ సభ్యులు లక్ష్మీనారాయణ, ప్రొ.శివ రామకృష్ణప్రసాద్, శర్వాణి, ఏకాంబరం, దత్త ప్రచారక్ రాజేంద్రప్రసాద్, అర్చకులు గోపికృష్ణశర్మ, శ్రీనివాస్, రవీందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్ వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా



నజ్ముల్ షకీబ్



అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్ముదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్ముదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్ముదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా


రవితేజ

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.


అనుష్క

అనుష్క @ 50

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.


కమల్ హాసన్

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.


● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజ మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


● గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగ్లా నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్

''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ–''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.

